క్లుప్తంగా

శివయ్యకు కళా వందనం



నెల్లూరు(బృందావనం) : కార్తీక మాసం తొలి సోమవారం రాకను పురస్కరించుకుని భక్తవత్సల నగర్‌కు చెందిన కార్పెంటర్ ఎం.శ్రీనివాసులు ఆదివారం 120 బొట్టు బిళ్లలతో శివలింగాన్ని తీర్చిదిద్దారు. నాలుగు అంగుళాల ఎత్తు, ఐదు అంగుళాల వెడల్పుతో పరమేశ్వరున్ని రూపొందించినట్లు ఆయన వివరించారు.

ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ నేడు

నెల్లూరు(బారకాసు) : తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రోడ్లు, ఆక్రమణలు తదితర సమస్యలపై నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, అదనపు కమిషనర్, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం



కొండా బలరామిరెడ్డికి సత్కారం

నెల్లూరు(బృందావనం) : సామాజిక సేవా కార్యక్రమాల్లో తన వంతు తోడ్పాటు అందిస్తున్న కొండా బలరామిరెడ్డి సేవలు ప్రశంసనీయమని రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. బట్వాడిపాళెం శాంతినగర్‌లోని నిర్మలసాధలో కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ రెడ్ల ఐక్యవేదిక సామాజిక సేవల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు 100 సీలింగ్ ఫ్యాన్లు అందజేయాలని సమావేశంలో తీర్మానించామన్నారు. కొండా నిరంజన్‌రెడ్డి, హైటెక్ రమణారెడ్డిలు 25 సీలింగ్ ఫ్యాన్లను అందజేసేందుకు సమ్మతించారన్నారు. అనంతరం కొండా బలరామిరెడ్డిని సత్కరించారు. సమావేశంలో డాక్టర్ బీవీ రెడ్డి, డాక్టర్ నిశ్చల ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



నెల్లూరు(బృందావనం) : నగరంలోని లక్ష్మీపురం నాలుగో వీధిలో ఉన్న శ్రీవారి నిలయంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మణికంఠ భక్తసేవా సమాజం ఆధ్వర్యంలో గాదంశెట్టి చంద్రశేఖర్, హేమంత్‌ల పర్యవేక్షణలో జరిగిన పూజా కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు విశేషంగా తరలివచ్చి భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.



మినీబైపాస్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్





ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాలు

రోడ్డుపైనే వ్యాపారం

- ట్రాఫిక్ స్తంభిస్తున్నా పట్టించుకోని అధికారులు
- దుకాణదారులకు ప్రత్యామ్నాయం చూపిస్తే సమస్యకు పరిష్కారం

నగరంలోని మినీబైపాస్ రోడ్డు వనంతోపు సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌పై చేపల దుకాణాలు వెలిశాయి. ఉదయం వేళల్లో ఇక్కడ వ్యాపారం జోరుగా సాగుతోంది. వినియోగదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి చేపలను కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల సగం రోడ్డు వరకు నిలిచిన వాహనాలతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. సాధారణ రోజుల కంటే ఆదివారం ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. చేపల వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాల్సిన అధికారులు కనీస దృష్టి సారించడం లేదు. దీనివల్ల వాహనదారులతో పాటు వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు

అమీర్‌జాన్‌కు పురస్కారం



అమీర్‌జాన్ వేసిన బెనారస్ చిత్రం



అమీర్‌జాన్‌ను సన్మానిస్తున్న చిత్రకారులు

నెల్లూరు(బృందావనం) : సింహపురికి చెందిన చిత్రకారుడు షేక్.అమీర్‌జాన్ 'చిత్రకళ విపంచి' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా ఒంగోలులో కళాయజ్ఞ, ఒంగోలు సృష్టి ఆర్ట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రాచీన భారత వైభవం' అంశంపై ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ 2024 చిత్రకళా పోటీలను ఆదివారం నిర్వహించారన్నారు. ఇందులో తాను వేసిన పవిత్ర పుణ్యక్షేత్రం బెనారస్ (వారణాసి) చిత్రానికి పురస్కారంతో పాటు ప్రోత్సాహక బహుమతి లభించిందని వివరించారు. ఈ పురస్కారాన్ని చిత్రకారులు శేషబ్రహ్మం, తిమ్మిరి రవీంద్ర, శ్రీనివాస పంతంగి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనందవేలు అందజేసి అభినందించారన్నారు.

నవ్వండి.. దీర్ఘాయుష్షు పొందండి



ఎన్నికైన నూతన కార్యవర్గం

నెల్లూరు(అర్బన్) : ప్రతిఒక్కరూ నవ్వుతూ ఉండడం ద్వారా ఆరోగ్యంతో పాటు దీర్ఘాయుష్షులు పొందుతారని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పి.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని వీఆర్సీ గ్రౌండ్‌లో వీఆర్సీ లాఫింగ్ క్లబ్ మొదటి వార్షికోత్సవ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బండారు సుబ్బారెడ్డి, కార్యదర్శిగా పంచాయతీరాజ్ ఇంజినీర్స్ జేఏసీ మాజీ రాష్ట్ర వైస్ చైర్మన్ షేక్. రియాజ్‌బాషాలను ఎన్నుకున్నారు. వీరితో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వాకింగ్ లాఫింగ్ క్లబ్బులతో ప్రతిఒక్కరిలోనూ ఉత్సాహం వస్తుందన్నారు. లాఫింగ్ క్లబ్‌లను మొదట స్థాపించి ప్రపంచానికి పరిచయం చేసిన ప్రముఖ డాక్టర్ మదన్‌కటారియా భారతీయుడు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం యోగా లాఫింగ్ గురువు బొప్పా వెంకురెడ్డికి యోగారత్న అనే బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, బలరామనాయుడు, వెంకటాద్రిరెడ్డి, క్లబ్ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది నన్నేసాహెబ్, క్లబ్ డైరెక్టర్లు ఆజాద్, జాకీర్, వెంకటేశ్వర్లు, శివబాలసుబ్బారావు, డాక్టర్ పీవీ నరసింహశాస్త్రి, జాయింట్ కార్యదర్శి విజయ్‌కుమార్, పుట్టా ఎస్టేట్ వాకర్స్ అధ్యక్షురాలు పర్వీన్, అల్లూరు సీతారామరాజు వాకర్స్ అధ్యక్షురాలు రమాదేవి, వీఆర్సీ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి నళినీ మోహన్, పిరమిడ్ జ్ఞాన మందిరం ప్రతినిధులు, క్లబ్ ట్రెజరర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అవినీతిరహిత సమాజమే ధ్యేయం



ర్యాలీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నెల్లూరు(క్రైమ్) : అవినీతిరహిత సమాజమే ధ్యేయంగా దేశాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కోరారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అందులో భాగంగా జిల్లా విజిలెన్స్ అధికారులు, సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజల సహకారంతో ఆదివారం నగరంలోని విజిలెన్స్ కార్యాలయం నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం మీదుగా తిరిగి విజిలెన్స్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరి, డీసీటీఓ విష్ణురావు, అధికారులు వేణుగోపాల్, అవినాష్‌రెడ్డి, గోపాలకృష్ణ, సుబ్బయ్య, వెంకట్‌రెడ్డి, ఇతరశాఖల అధికారులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని కిసాన్ నగర్, జనార్దనరెడ్డికాలనీ, హరనాథపురంలోని పలువురికి అమ్మయూత్ ఫౌండేషన్ ద్వారా ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. కిసాన్‌నగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రాజ్యలక్ష్మి, రాజేశ్వరరావు దంపతులకు, జనార్దనరెడ్డి కాలనీలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సుభాషిణి, హరనాథపురంలో జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న అమూల్యకు రూ.6 వేల వంతున ఆర్థిక సాయం అందించారు. దాతల సహకారంతో ప్రతినెలా ఆర్థిక సాయం అందిస్తున్నామని నిర్వాహకులు రమేష్‌బాబు, కార్తీకేయ తెలియజేశారు.

ట్రైసైకిల్ వితరణ



నెల్లూరు(దర్గామిట్ట) : ఉదయగిరి మండలం సంజీవరావుపల్లి గంగులవారి చెరువు గ్రామానికి చెందిన బడబాగ్ని కేశవరాజు ప్రమాదంలో ఓ కాలు కోల్పోయాడు. కర్రల సాయంతో నడిచే కేశవరాజుకు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వీపీఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం ఎలక్ట్రానిక్ ట్రైసైకిల్‌ను కేశవరాజుకు అందజేశారు.

ఆర్డీఓను సస్పెండ్ చేయాలి

నెల్లూరు(దర్గామిట్ట) : డీఆర్సీ సమావేశంలో ప్రొటోకాల్ విషయంలో విధి విధానాల మీద అవగాహన లేకుండా వ్యవహరించిన నెల్లూరు ఆర్డీఓ అనూషను వెంటనే సస్పెండ్ చేయాలని స్టూడెంట్ జేఏసీ చైర్మన్ జీవీ ప్రసాద్ అన్నారు. నెల్లూరులో ఆయన ఆదివారం మాట్లాడారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విషయంలో ఆర్డీఓ ప్రొటోకాల్ పాటించలేదని, దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గృహిణుల దినోత్సవం



గృహిణులకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : జాతీయ గృహిణుల దినోత్సవాన్ని నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న వికాస్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి– జ్యోతి దంపతులు పలువురు గృహిణులను ఘనంగా సన్మానించారు. కుటుంబ పోషణలో వారి సేవలను ప్రశంసించారు. గృహిణులు పి.వల్లీపద్మావతి, డి.సుగుణ, టి.శ్రీలత, ఎం.రాజేశ్వరి, ఎం.కవిత, వి.లక్ష్మి, కె.ఆదిలక్ష్మి, ఎం.రజని, ఎం.మాధవి తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ స్మరణోత్సవాలకు భిక్షాటన



నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో మార్చి 19 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న 60వ త్యాగరాజ స్మరణోత్సవాల నిర్వహణకు భిక్షాటన ప్రారంభించినట్లు ఆ కమిటీ శాశ్వత కార్యదర్శి ఎనమంద్ర నాగదేవి ప్రసాద్ తెలిపారు. వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో ఆదివారం కీర్తనలు ఆలపిస్తూ భిక్షాటన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు సంగీత కళాకారులు జోలెపట్టి భిక్షాటనకు శ్రీకారం చుట్టారని ఆయన వివరించారు.

పిల్లలకు చదువే ఏకైక ఆస్తి



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే ఏకైక ఆస్తి చదువే అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని కాపుభవన్‌లో బలిజ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ మార్కులు సాధించిన పేద బలిజ విద్యార్థులకు ఆదివారం పురస్కారాలు అందించే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన 104 మంది విద్యార్థులకు రూ.4.20 లక్షలను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్, బలిజ సంఘం నాయకులు అనిల్‌కుమార్, చక్రధర్ పాల్గొన్నారు.

కళారంగాన్ని కాపాడుకోవాలి



గుర్తింపు కార్డులు అందుకున్న పద్యనాటక కళాకారులతో అతిథులు

• అమరావతి కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం) : కళారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతిఒక్కరిపై ఉందని 25 కళాసంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. సింహపురి పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సింహపురి పద్యనాటక కళాకారుల సమావేశం స్థానిక మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ జి.విజయకుమార్ మెమోరియల్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలోని సభ్యులకు గుర్తింపు కార్డులు, పత్రాలను అందజేశారు. అనంతరం పద్యనాటకాల ప్రాధాన్యతను అమరావతి కృష్ణారెడ్డి వివరించారు. కళారంగానికి విశిష్ట సేవలందిస్తున్న కళాకారులకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వర్లు (భద్రాచలం బాబు) మాట్లాడుతూ పద్యనాటక కళాకారులు ఐక్యతగా సాగి నాటక రంగ ప్రగతిలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వాలు పద్యనాటక రంగానికి చేయూతనందించాలని ఆకాంక్షించారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.చక్రపాణి, కోశాధికారి కొమ్మిరెడ్డి హరనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చెంచురామయ్య, సహాయ కార్యదర్శులు దండి సురేష్ బాబు, ఉడతా ప్రభాకర్, కసుమూరు మస్తానయ్య, గౌరవాధ్యక్షుడు షేక్.ఖాజామస్తాన్, నజీర్, ఎం.పెంచలనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



ఇంటింటి ప్రచారంలో సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లో సోమవారం చేపట్టనున్న సామూహిక నిరసన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు కోరారు. నగరంలోని 53వ డివిజన్ పునరావాస కాలనీ, నల్లకాలువ, డెయిరీ ప్రాంతాల్లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 53, 54 డివిజన్‌లో గత 60 ఏళ్లుగా ఉంటున్న వేలాది కుటుంబాలకు సంబంధించిన ఇళ్లకు, స్థలాలకు ఇప్పటికీ రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదన్నారు. పన్నుల రూపంలో ఈ రెండు డివిజన్ ప్రజలు నెల్లూరు కార్పొరేషన్‌కు రూ.కోటి వరకు చెల్లిస్తున్నా, రిజిస్ట్రేషన్ పట్టాలు లేకపోవడం బాధాకరమన్నారు. రిజిస్ట్రేషన్‌ల కోసం దశల వారీగా పోరాటాలు సాగిస్తామని, అందులో భాగంగా స్థానిక ప్రజలతో వెంకటేశ్వరపురం సెంటర్‌లో సోమవారం సామూహిక నిరసన ధర్నా చేస్తున్నట్లు తెలియజేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యుడు మూలం ప్రసాద్, డివిజన్ శాఖా కార్యదర్శి గడ్డం శ్రీనివాసులురెడ్డి, నాయకులు మణి, రవి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న యోగాసనాలు



నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ – 14, 17 విభాగాల్లో జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి యోగా చాంపియన్‌షిప్ –2024 పోటీలు ఆదివారంతో ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికల యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కాగా ఈ పోటీల విషయమై ప్రచారం సక్రమంగా చేయకపోవడంతో తిలకించేవారు లేక వెలవెలబోయాయి. – నెల్లూరు(టౌన్), సాక్షి ఫొటోగ్రాఫర్









